నత్తనడకన 'మన ఊరు-మన బడి'

- పనుల్లో ఆలస్యం చేస్తున్న కాంట్రాక్టర్లు
- బిల్లుల చెల్లింపులో జాప్యం
- అధికారుల పర్యవేక్షణ అంతంతే


బతికపల్లి పాఠశాలలో నిర్మాణంలో ఉన్న టాయిలెట్లు

పెగడపల్లి: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' అనే కార్యక్రమం ప్రారంభించింది. ఈ మేరకు మండలంలోని పలు పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు చేసేందుకు ఎస్ఎంసీ చైర్మన్లు ముందుకు రాకపోవడంతో సర్పంచులే పనులు చేస్తున్నారు. అయితే ఈ పనులను పర్యవేక్షించే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

ఉపాధి పథకం కింద అదనపు నిధులు

మండలంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలు కలిపి 13 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో చేపట్టిన పనులు ఇప్పటికే పూర్తికావాల్సి ఉండగా చేసిన పనులకు బిల్లు చెల్లింపులో అధికారులు పట్టించుకోవడం లేదన్న కారణంగా కాంట్రాక్టర్లు పనులు నిర్వహించడంలో ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో తాము అప్పులపాలు కావాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. మొదటి విడతలో భాగంగా బతికపల్లిలో రూ.39.71లక్షలు, నంచర్లలో రూ.32లక్షలు, నందిగిరిలో 7లక్షలు, పెగడపల్లిలో 48.72లక్షలు, మద్దులపల్లిలో రూ.11,03లక్షలు, వెంగళాయిపేటలో రూ.14.51లక్షలు, అయితిపల్లిలో రూ.53.17లక్షలు, సుద్దపల్లిలో రూ.61.72 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, టాయిలెట్లు తదితరాలకు ఉపాధిహామీ పథకం కింద అదనంగా నిధులు కేటాయించారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువు..

పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా ఇక్కడ మాత్రం ఆర్అండ్‌బీ ఏఈ పర్యవేక్షిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్లు బేస్‌మెంట్ దశలో ఉండగా టాయిటెట్ల నిర్మాణాలు పునాదుల దశలోనే ఉన్నాయి. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్లాస్టరింగ్ పనులు, కరెంటు పనులు పూర్తయ్యాయి. ఇంజనీరింగ్ అధికారులు మాత్రం ఫోన్‌లోనే మానిటరింగ్ చేస్తున్నారని క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదన్న ఆరోపణలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి మండలంలో 'మన ఊరు-మన బడి' పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనుల్లో, నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాణ్యత పాటించాలి



మండలంలో చేపట్టిన పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో కాంట్రాక్టర్లు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం కూడా పనుల ఆలస్యానికి కారణమవుతోంది. జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి.

– కిషోర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు

పనుల్లో వేగం పెంచాం



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు-మన బడి' కార్యక్రమం ద్వారా జరుగుతున్న పనుల్లో కొంత మేరకు ఆలస్యంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం పనుల్లో వేగం పెంచాం. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. పనుల్లో రాజీ పడకుండా నాణ్యతతో కూడిన పనులు చేయిస్తున్నాం.

– ఆదిత్య, ఏఈఈ

నిత్యం పర్యవేక్షిస్తున్నాం



మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాఠశాలలకు మంజూరైన అభివృద్ధి పనులు 60శాతం వరకు పూర్తయ్యాయి. ప్రతినిత్యం పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. పనుల్లో వేగం పెంచి 15 రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– పుల్లయ్య, ఎంపీడీవో

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత


సాయం అందిస్తున్న మిత్రులు, నాయకులు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన పొక్కిలి రమేశ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ మేరకు అతడి మిత్రులు, పలువురు దాతలు రూ.25వేలు ఆదివారం అందజేశారు. రమేశ్‌కు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు వేముల శ్రీనివాస్, ఎం.డీ కరీం, ఎం.డీ అహ్మద్, గణేశ్, కుసుమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీఆంజనేయస్వామి ఆలయంలో పూజలు


అన్నదానంలో భక్తులు

రాయికల్: పట్టణంలోని పురాతన శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయ అర్చకుడు ప్రదీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో నూతన ఆలయ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని, ఇందుకు భక్తులు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా 2వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాయితి గంగాధర్, సామల సతీశ్, చింతకుంట సాయికుమార్, భీమనాతి రాజున, కొత్తపల్లి సంజీవ్ ఉన్నారు.

క్రికెట్ కిట్లు అందజేత


క్రికెట్ కిట్ అందజేస్తున్న అనిల్‌కుమార్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని రేకులపల్లి గ్రామంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గ్రామంలో యువకులు, చిన్నారులకు గ్రామానికి చెందిన ఎలగందుల అనిల్‌కుమార్ క్రికెట్ కిట్లతో పాటు, పలు క్రీడలకు సంబంధించిన క్రీడా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల లక్ష్మి, ఉపసర్పంచ్ కాసారపు రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలతో క్రీడాకారులు మరింత ఎదగడానికి దోహదపడుతుందన్నారు.

టాలెంట్ విజేతలకు పురస్కారాలు ప్రదానం


విజేతలకు పురస్కారం ప్రదానం

కోరుట్లటౌన్: ఈద్‌గాహ్ మస్జిద్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో టాలెంట్, కాంపిటీషన్ టెస్టులో విజయం సాధించిన విద్యార్థులకు నగదు, ప్రతిభా పురస్కారాలు ఆదివారం ప్రదానం చేశారు. స్థానిక కింగ్స్ గార్డెన్‌లో సొసైటీ ఆధ్వర్యంలో విద్య, సంస్కృతి, విద్యా విధానంపై మౌలానా అబ్దుల్ కరీం, మౌలానా మహ్మద్ మజహర్ ఖాస్మీ, ముఫ్తి ముహ్మద్ గయాస్ మొహియుద్దీన్ ప్రసంగించారు. అనంతరం విజేతలకు నగదు, మెమెంటోలు అందజేశారు. బీడీ లీఫ్స్ కాంట్రాక్టర్ రవూఫ్, అస్రార్, కన్వీనర్ మౌలానా లాయిఖ్ సొసైటీ అధ్యక్షులు అబ్దుల్ కరీం, వహీద్, రహీం, ఫిసియోద్దీన్ సిద్దిఖీ, జావిద్, జైనొద్దీన్, రహీం, షకీల్, అఖిల్, అబూబకర్ సిద్దిఖీ, నిజాం, అజ్మత్, నజాహత్ రఫీ, ఖాలీద్, జవ్వాద్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి లక్ష పుష్పార్చన


పుష్పాభిషేకంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల/కోరుట్లటౌన్: పట్టణంలోని శ్రీఅయ్యప్ప ఆలయం ప్రాంగణంలో శ్రీఅయ్యప్పస్వామికి లక్ష పుష్పార్చన కార్యక్రమం ఆదివారం నేత్ర పర్వంగా జరిగింది. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు చిదురాల నారాయణ, అధ్యక్షుడు అంబటి శ్రీనివాసు, దాతలు చింత లక్ష్మీనారాయణ, లావణ్య, బుడిగె గంగాసుమన్, అర్చన, ముక్కెర చంద్రశేఖర్, లత, దండికె వెంకటేశ్, భావన, కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ


పాల్గొన్న అయ్యప్పస్వాములు, భక్తులు


హాజరైన మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి: మండలంలోని చిల్వాకోడూర్ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అయ్యప్ప దీక్షస్వాముల ఆధ్వర్యంలో సామూహిక మహాపడిపూజ మహోత్సవ పూజ ఆదివారం వైభవంగా జరిగింది. జగిత్యాల, గుంజపడుగు గురుస్వాములు నీలం దశరథరెడ్డి, బ్రహ్మశ్రీ కట్ట సత్యనారాయణ, సీనియర్ గురుస్వాములు గందె వేణు, గందం పరంధాములు, అల్లాడి వెంకన్న, గురుస్వాముల మంత్రోచ్ఛారణల మధ్య అయ్యప్ప మహాపడి పూజ జరిగింది. గ్రామ పురవీధుల గుండా అయ్యప్పస్వామి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు, సర్పంచ్ కందుకూరి పద్మావతి, రవీందర్, ఎంపీటీసీ మహబూబ్, గురుస్వాములు తాండ్ర లక్ష్మణ్‌గౌడ్, బొమ్మెన కుమార్, గర్వందుల గంగన్న, బూస రాజేందర్, తాటిపాముల రమేశ్, ముక్తామణి, పప్పుల వెంకన్న, రమేశ్ రెడ్డి, బొమ్మెన నరేందర్, ఆలయ చైర్మన్ దాసరి తిరుపతి, మునిగాల మల్లేషం, సరస్వతి, రంగ నర్సింహస్వామి, గర్వందుల మల్లయ్య పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి జన్మదిన వేడుకలు


వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు అరటి, ఆపిల్ పండ్లు పంపిణీ చేశారు. రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు చీటి విద్యాసాగర్‌రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు గోపు శ్రీనివాస్, వేముల గంగరాజం, లోక శశిధర్‌రెడ్డి, గడ్డం శేఖర్‌రెడ్డి, బద్దం మహేందర్‌రెడ్డి, పుర్కుటపు సంతోష్‌రెడ్డి, దేవదాస్ పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సరం వేడుకలు


జగిత్యాలక్రైం: కేక్ కట్ చేస్తున్న డీఎస్పీ


మల్లాపూర్: గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో..


రాయికల్: విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో..

కోరుట్లటౌన్: పట్టణంలోని సి.ప్రభాకర్ గ్రంథాలయం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం వేడుకలు ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చెన్న విశ్వనాథం, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ కేక్ కట్ చేశారు.

డీఎస్పీ కార్యాలయంలో వేడుకలు

జగిత్యాలక్రైం: స్థానిక ధరూర్ క్యాంప్‌లోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రకాష్ కేక్ కట్ చేశారు. సీఐలు కిషోర్, క్రిష్ణకుమార్, సరిలాల్, ఎస్సైలు రాము, అనిల్, అశోక్ పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పెగడపల్లి: మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఇబ్రహీంపట్నం: మండలంలో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. దేవాలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

రాయికల్: మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మల్లాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు వేడుకల్లో పాల్గొన్నారు.

నూతన నియామకం


నియామక పత్రాలు అందిస్తున్న శికారి గోపి

కోరుట్లటౌన్: బీసీ యువజన సంఘం కోరుట్ల సెగ్మెంట్ ఇన్‌చార్జిగా వాసాల వినయ్, పట్టణాధ్యక్షుడిగా ఎనగందుల తిరుపతి, యువజన సంఘం అధ్యక్షుడిగా మాలెపు వంశీ ఎన్నికైనట్లు బీసీ యువజన సంఘం రాష్ట్ర కారదర్శి శికారి గోపికృష్ణ, సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్రప్రసాద్ ఆదివారం తెలిపారు. స్థానిక వాసవి మండపంలో బీసీ సంఘం సమావేశం నిర్వహించి, నూతనంగా ఎన్నికైన వారికి నియాకపు పత్రాలు అందజేశారు. బీసీ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్, వి.అనిల్, నవీన్, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

జగిత్యాలఅగ్రికల్చర్: మండలంలోని లక్ష్మీపూర్ సుభాష్ రైతు యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఏలేటి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సంగెపు జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పన్నాల తిరుపతిరెడ్డి, కోశాధికారిగా పన్నాల జీవన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గొనెపట్ల గంగారెడ్డి, గడ్డం సత్తన్న, మామిడి తిరుపతిరెడ్డి, గడ్డం గంగారెడ్డి, ఏనుగు చిన్న లక్ష్మారెడ్డి, కొప్పెర చిన్న వెంకట్ రెడ్డి, ఈరిశెట్టి గంగారెడ్డి ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

✦గుర్తు తెలియని వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కొన్నిరోజులుగా మానసిక స్థితి సరిగ్గా లేక స్టేడియంలో ఉంటున్న సుమారు 40–50 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

✦చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెకు చెందిన నూతికట్ల రాజవ్వ (70) అనే వృద్ధురాలు రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై అజయ్ కథనం ప్రకారం నూతికట్ల రాజవ్వ శనివారం తన చిన్న కొడుకు రాజన్న నడుపుతున్న ఆటోలో మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట వెళ్తున్న క్రమంలో.. బీర్‌పూర్ గ్రామానికి చెందిన బండారి విజయ్ బీర్‌పూర్ జూనియర్ కళాశాల నుంచి స్కూటీపై అతివేగంగా వస్తూ బీర్‌పూర్‌లోని చర్చి వద్ద ఆటోను ఢీకొన్నాడు. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. రాజన్నకు కాలు విరగగా, రాజవ్వ తీవ్రంగా గాయపడింది. రాజవ్వను చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి రాజవ్వ చిన్నకోడలు రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనాన్ని దహనం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

మెట్‌పల్లి: మండలంలోని కొండ్రికర్ల గ్రామంలో జిన్నా శంకర్ అనే వ్యక్తికి చెందిన టాటా మ్యాజిక్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. గ్రామస్తుల కథనం ప్రకారం శంకర్ ఉపాధి నిమిత్తం వాహనాన్ని కొనుగోలు చేసి నడుపుతున్నాడు. కాగా శనివారం రాత్రి పని ముగించుకొని వచ్చిన తర్వాత తన ఇంటి వద్ద ఉంచాడు. తెల్లవారుజామున చూసేసరికి అది దహనమై ఉంది. వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా వారు గ్రామానికి వచ్చి వాహనాన్ని పరిశీలించారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు


పుష్పగుచ్ఛం అందిస్తున్న లింగారెడ్డి

మెట్‌పల్లి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని నియోజకవర్గానికి చెందిన మాజీ సర్పంచ్ కొమిరెడ్డి లింగారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన కోరుట్ల నేతలు

కోరుట్లటౌన్: హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని పట్టణానికి చెందిన కోరుట్ల సెగ్మెంట్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కటుకం చంద్రశేఖర్, ఎన్ఎస్‌యూఐ నేత పొల్కం శివ ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా రోడ్డు

సారంగాపూర్: జగిత్యాలరూరల్ మండలం అనంతారం, గుల్లపేట గ్రామ క్రాసింగ్ నుంచి అర్పపల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామాల వైపు వచ్చే తారురోడ్డు కొంత దూరం ఒక పక్కన కుంగిపోయింది. అసలే సింగిల్‌రోడ్డు, అందులో దాదాపు 50మీటర్ల పొడవుతో ఒక పక్క కుంగిపోయి అత్యంత ప్రమాదకరంగా మారింది. బైక్ మీద వెళ్లేవారు కుంగిన రోడ్డు వద్ద పడిపోయి గాయపడ్డ సంఘటనలు ఉన్నాయి. దీనిపై అర్అండ్‌బీ అధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: రాజశేఖర్, ఆర్అండ్‌బీ, ఏఈ, సారంగాపూర్
ఫోన్ నంబర్: 94408 18883

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలక్రైం: అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన రవ్వరూపుల లక్ష్మన్‌కు చెందిన ఇల్లు శనివారం కాలిపోగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు అందించడంతో పాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ మల్లారెడ్డి, నాయకులు నారాయణ, మల్లేషం, బక్కన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డీఎస్పీ ప్రకాష్, సీఐలు కృష్ణకుమార్, కిశోర్, ఎస్సైలు అనిల్, రాము, రమేశ్, కిరణ్ కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

జగిత్యాలటౌన్: గుర్రం సత్యనారాయణగౌడ్ జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికవడం అభినందనీయమని ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ ప్రశంసించారు. జగిత్యాలరూరల్ మండలం పోరండ్ల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సత్యనారాయణగౌడ్ ఆదివారం తపస్ నేతలతో కలిసి ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఉపాధ్యాయుడిని ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవయ్య, ప్రసాదరావు, ఉపాధ్యాయ సంఘం జగిత్యాల మండల బాధ్యులు కూర్మాచలం రఘునందన్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రానున్నది వైఎస్సార్‌టీపీ ప్రభుత్వమే


మాట్లాడుతున్న నాయకులు

మల్యాల: రాష్ట్రానికి మొదటి మహిళా సీఎంగా రానున్న రోజుల్లో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలమ్మ పదవి చేపట్టనుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మండలంలోని తాటిపల్లిలో ఆదివారం స్థానికులు వైఎస్సార్‌టీపీలో చేరగా చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మతో కలిసి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ షర్మిలమ్మ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. త్వరలో పునః ప్రారంభం కానున్న ప్రజాప్రస్థానం పాదయాత్రకు వేలాదిగా తరలిరావాలని కోరారు. సీఎం కేసీఆర్ హామీలన్నీ నీటిమూటలే అని విమర్శించారు.

షర్మిల సీఎం కావాలని పూజలు..

రాష్ట్రానికి షర్మిల సీఎం కావాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి కాముని గంగాధర్, సుమన్‌రెడ్డి కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి


రాజారంలో గ్రామ అధ్యక్షుడికి సన్మానం

ధర్మపురి: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మాలలు సద్వినియోగం చేసుకోవాలని మాలల మండల అధ్యక్షుడు అనంతుల లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం మల్లేశ్ ఆదేశాల మేరకు మండలంలోని రాజారం గ్రామంలో ఆదివారం మాలల గ్రామ కమిటీల అధ్యక్షుల సమక్షంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాజారం గ్రామశాఖ అధ్యక్షుడు కండ్లె లక్ష్మణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రవికుమార్, కాల్ల లచ్చన్న, బోనాల రాజన్న, కండ్లె లక్ష్మణ్, తోడేటి నర్సయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ సాయం

జగిత్యాలక్రైం: అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన జగిత్యాలరూరల్ మండలం అంబారిపేటకు చెందిన లక్ష్మన్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్, ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడారు.

మెట్‌పల్లి ఎస్సైగా శ్యామ్‌రాజ్

మెట్‌పల్లి: మెట్‌పల్లి ఎస్సై–1గా శ్యామ్‌రాజ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఎస్సైగా ఉన్న సదాకర్‌ను జగిత్యాల సీసీఎస్‌కు బదిలీ చేశారు. కాగా ఆయన స్థానంలో కోరుట్లలో పనిచేస్తున్న శ్యామ్‌రాజ్‌ను నియమించారు.

కోరుట్లలో చోరీ

కోరుట్లటౌన్: పట్టణంలోని బాలాజీరోడ్‌కు చెందిన చిలువేరి శంకర్ ఇంట్లోని బంగారం, నగదు చోరీకి గురైనట్లు పోలీసులను ఆదివారం ఆశ్రయించాడు. బాధితుని కథనం ప్రకారం చిలువేరి శంకర్ తన ఇంటికి తాళం వేసి, 5 రోజుల క్రితం తిరుపతి యాత్రకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. కాగా ఆదివారం ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో ఉన్న బీరువా తెరిచి ఉంది. బీరువాలో దాచుకున్న 5 తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు శంకర్ చెప్పారు. ఈ సంఘటన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుగు తెలిపారు.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.